# వర్ణచిత్రం



చిత్రపు హనుమంతరావ్

"మనసు అద్దం లాంటిదిరా. మనసూ, అద్దమూ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలిరా..."

అయిదేళ్ల క్రితం ఒక సందర్భంలో కృష్ణమూర్తిగారు రంగన్న తాతతో అన్న మాటలవి.

హౌరా మద్రాసు లైను మీద ఉన్న రైల్వేస్టేషను అది. రాత్రివేళ రాను రాను చీకటి మరింత చిక్కనవుతున్నది. ఫస్టు క్లాసు వెయిటింగు రూములో అద్దం ముందు నిలబడ్డ రంగన్న తాతకు ఒకనాడు కృష్ణమూర్తిగారు అన్నమాటలు జ్ఞప్తికి వచ్చినాయి. అద్దం దుమ్ముపట్టి ఉంది. అద్దంలో తన ప్రతిబింబం మసక మసగ్గా కన్పిస్తున్నది 'ఈరేసూ, అప్పలసామీ ఏంసేస్తున్నారు ఎదవలు వచ్చి తొంగుంటరా?...' రంగన్న తాత విసుక్కున్నాడు. దుమ్ము పట్టిన అద్దాన్ని చూసినప్పుడల్లా కృష్ణమూర్తిగారి విగ్రహం వాడికళ్ల ముందు మెదుల్తుంది. జాలీ, దయా, దాక్షిణ్యాలతో కూడిన ఆయన స్వరం విన్పించి నట్లవుతుంది. ఆయన మంచితనం గుర్తుకు వస్తుంది.

రంగన్న తాత తడిగుడ్డతో అద్దాన్ని తుడిచాడు. తృప్తిగా తన ప్రతిబింబాన్ని చూసుకుంటూ కొద్దిక్షణాలు నిలబడిపోయాడు. తలపాగ..ముడతలు పడ్డ నుదురు లోపలకు పోయిన కళ్లు..ముడతలు పడ్డ కనురెప్పలు.. ఎముకలు కన్పిస్తున్న దవడలు తెల్లబడ్డ గెడ్డమూ, మీసాల మధ్య పెదాలు విడినప్పుడు కన్పించే గారకట్టిన పళ్లు ఇత్తడి ఫ్రేము కళ్లజోడు...ఎర్రకోటు. అంత వరకే కన్పిస్తున్నది. 'ఏడనున్నారో దర్మ ప్రబువులు..' గొణుక్కున్నాడు రంగన్న తాత.

ఆ వెయిటింగు రూములో ఉన్నవి. గది మధ్యలో 'రవుండ్ టేబిల్'..దాని చుట్టూ ఆరు మామూలు 'పేము కుర్చీలు... గోడ వారగా రెండు పేము పడక కుర్చీలు..గది కొకమూల 'మిర్రర్ టేబిల్' పైనుండి వ్రేళ్లాడుతూ ఒకలైట్, రెండు పంకాలు.. గుమ్మందగ్గర తను కూర్చునే స్టూలు.

రంగన్న తాత 'మిర్రర్ టేబిల్' కూడా తుడిచాడు. ఆ తర్వాత కుర్చీలు..ఆతర్వాత 'రవుండ్ టేబిల్', గచ్చునేల చీపురుతో తుడిచాక తడిగుడ్డ పెట్టి తుడిచాడు. గుమ్మం దగ్గరకు వచ్చి స్టూలు మీద కూర్చుని లోపలకు చూశాడు. నేల తళతళ్లాడుతోంది. అద్దం మెరుస్తోంది. కుర్చీలూ బల్లలూ శుభ్రంగా ఉన్నాయి. తృప్తి

కలిగింది. దృష్టి ప్లాటుఫారం మీాదకు వెళ్లింది.

ప్లాటుఫారం మెర్క్యురీ దీపాల వెలుగులో కళకల్లాడుతోంది. పెళ్లికి వచ్చిన అతిథుల్లా హడావుడిగా తిరుగుతున్నారు జనం. జనసమ్మర్దం రానురాను హెచ్చుతున్నది. ప్రయాణీకుల సామాన్లు ప్లాటుఫారం మీాద అక్కడక్కడ చిందర వందరగా పడి ఉన్నాయి దృష్టి కాలేజీ విద్యార్థులపై పడింది నలుగురైదుగురు విద్యార్థులు రంగన్న తాతకు బాగా ముఖపరిచయస్థులు. ఎందువల్లనంటే మెయిలు వచ్చే వేళకు వాళ్ళు ప్లాటుఫారం మీాద సిద్ధం 'ఏళ పట్నపు బడికి ఎడతారో లేదో? ఈ శ్రద్ధ సదువు మీాదుంటే బాగుపడతారు గందా?' అనుకుంటాడు రంగన్న తాత వాళ్ళను చూసి వాళ్ళు మెయిలు రావడమే తరువాయి ఒకొక్క కంపార్టుమెంటు కిటికీ ల్లోంచి దృష్టిని పోనిచ్చి లోపలున్న మనుషుల్ని చూస్తూ ముందుకు వెడతారు ఎవరైనా అమ్మాయి ఒంటరిగా రైలు ఎక్కినా, దిగినా ఆమె వాళ్ల సహాయం అర్థించకుండానే సామాన్లు మోసేస్తారు ఆమె చిరునవ్వు నవ్వితే కరిగిపోతారు. 'థేంక్సు' అంటే మెలికలు తిరిగిపోతారు 'ఏటో ఆ ఎర్రి ఏసాలు..' అన్పిస్తుంది రంగన్న తాతకు.

'టీ' బండిని చూడ్డంతో 'టీ' త్రాగాలన్న కోరిక పుట్టింది రంగన్న తాతకు. జేబులో ఉన్న చిల్లర లెక్కపెట్టుకున్నాడు. వందొమ్మిది పైసాలున్నాయి వెళ్లి ఒక బిస్కెట్టు తిని, టీ త్రాగాడు. ఆరు పైసలిచ్చి మూడు చుట్టలు కొన్నాడు. వెయిటింగు రూము దగ్గరకు వచ్చి స్టూలుపై కూర్చుని లోపలకు చూశాడు ఎవ్వరూ లేరు చుట్ట కొసను కొరికి ఉమ్మేస్తూ 'ఇదేటి సెపుమా ఇయ్యాళ మెయిలొచ్చే ఏళవుతున్నా ఎవరూ రానేదు?' అను కున్నాడు పళ్ల మధ్య చుట్ట కొసనునొక్కి పెట్టి ముట్టించాడు గుప్పు గుప్పున రెండు దమ్ములు లాగి పొగను వదిలాడు 'ఏటోకాని టీ తాగి ఓ సుట్ట ముక్క తగిలిత్తే తేలిగ్గుంటది సొరగంలో ఉన్నట్టన్పిస్తది. ఏటో ఆటి మహిమ కూడు తినకపోయినా పర్లేదుకాని, టీ తాగకపోయినా, సుట్టముక్క కాల్చకపోయినా పిచ్చెత్తినట్లన్పిస్తది.' చంద్రి గుర్తుకు వచ్చింది 'ఏటయ్యా సుట్టముక్క కూతంత తగ్గించవు గంద తెగ దగ్గుతున్నవ్' అనేది జీంయితమే కాలిపోనాదిగందే...బతుకే తెల్లారిపోనాదిగందే...ఎవరి కోసం బతకాలే? ...

పాతికేళ్ల యువకుడు లెదరు సూటు కేసు చేత్తో పట్టుకుని హడావుడిగా వెయిటింగు రూములోకి ప్రవేశించాడు సెంటు వాసన గుప్పుమంది. రంగన్న తాత లేచి నిలబడ్డాడు ఆరడుగుల సన్నని విగ్రహం, చామనఛాయ కొస్త చిన్నకళ్ళు పొడుగైన ముక్కు దొప్ప చెవులు నొక్కుల జుత్తు పక్కపాపిడి తీసి పైకి దువ్వాడు నుదుటిమీాద ఒక పాయ జుత్తు పడుతోంది నల్లని టెర్లిన్ పంట్లాం, పొడుగు చేతుల తెల్లని టెర్లిన్ చొక్కా 'టక్' చేసుకున్నాడు చొక్కాచేతులు పైకి రెండు మడతలు మడిచాడు. ఎడంచేతికి రోలెక్సు వాచీ తళతళ్లాడుతున్న నల్లని 'ఎంబాసిడర్' షూ 'డబ్బున్నోళ్ల పిల్లడు' అనుకున్నాడు రంగన్న తాత అతను సూటు కేసు 'రవుండ్ టేబిల్' మీాద పెట్టి, పడక కుర్చీలో వెనుకకు జార్లపడి కూర్చున్నాడు కాళ్ళు కుర్చీ చేతుల మీాద పెట్టుకుని

రంగన్న తాత చుట్ట పారేసి, 'మిర్రర్ టేబిల్' మీాద ఉన్న రిజిష్టరు చేత పట్టుకుని అతని వైపు వచ్చాడు కుంటుకుంటూ వస్తున్న రంగన్న తాతను చూసి 'పాపం పూర్ ఫెలో.' అనుకున్నాడతను 'ఆయ్యేళ మనసే కుంటిదయింది గందా' అనుకున్నాడు రంగన్న తాత అతడి చూపుల్ని గమనించి

"బాబూ తవరిది ఒకటో కలాసు టిక్కెట్టే గదండీ "

"ఏం టిక్కెట్టు చూస్తావా?"

"మాటోరుటకి అడిగేను బాబూ తవరి పేరూ, తక్కిన ఇవరాలూ రాయండి "

రంగన్న తాత రిజిష్టరు అతని ముందుంచాడు అతను జేబులు వెతుక్కుంటూంటే పెన్సిలు చేతికిచ్చాడు అతను వివరాలు వ్రాశాడు అతని పేరు ఎ మోహనరావు వెడుతున్నది మద్రాసు టిక్కెట్టు నెంబరు

రంగన్న తాత రిజిష్టరు మూసి, దాన్లో పెన్సిలుంచి 'మిర్రర్ టేబిల్' మీాదపెట్టి గుమ్మం దగ్గరకు వెళ్ళి స్టూలుపై కూర్చున్నాడు

మోహనరావు లేచి నిలబడి వళ్ళు విరుచుకున్నాడు 'హిప్ పాకెట్' గుండీ తీసి లోపల ఉన్న డబ్బు తీసి లెక్కపెట్టాడు అయిదు పచ్చనోట్లు తిరిగి యథాస్థానంలో ఉంచి గుండీ పెట్టాడు. జేబులోంచి పర్సు తీశాడు ఒక అరలో ఉన్న రెండు టిక్కెట్లు తీసి చూసి లోపల పెట్టేశాడు రెండో అరలో ఉన్న డబ్బుతీసి లెక్కపెట్టాడు. ఆరు పది రూపాయల నోట్లు; ఒక రెండు రూపాయల నోటు. కొద్దిగా చిల్లర. రెండు రూపాయల నోటు చొక్కా జేబులో పెట్టుకుని, తక్కిన డబ్బంతా పర్సులో పెట్టేసి జేబులో పెట్టుకున్నాడు పర్సు. రంగన్న తాత అతడిని గమనిస్తూనే ఉన్నాడు 'ఏటో ఈ కాలం కుర్రోళ్లు జేబుల్లో డబ్బెట్టుకుని తిరుగుతారు..' ఏదో అందామనుకుని నోరు తెరిచాడు. ఆదే సమయాన మోహనరావు వాడి వైపు అదోలా చూస్తూ అన్నాడు

"ఏమిటలా చూస్తున్నావ్? "

ఆ మాటలు రంగన్న తాత చెవులకు చేదుగా ధ్వనించాయి అతడి చూపులు దొంగాడి వైపు తోటి మానవుడు చూసే చూపుల్లా ఉన్నాయి. 'దొంగాడిలా అలా చూస్తున్నావేమిటి?..' అంటున్నట్లు అన్పించింది రంగన్న తాతకు. 'సీ పాడులోకం.. తనేదో జాగరత్త సెబుదారనుకుంటే ఎలా సూసేడు? ఏటన్నాడు? తను డబ్బు కోసం ఆసపడే మనిసికాదని తెల్సు ఈ కుర్రోడికి.' అనుకున్నాడు రంగన్న తాత.

రంగన్న తాత కాక మరో ఇద్దరు కాపలాదార్లు ఉన్నారు ఆ వెయిటింగు రూముకి. వాళ్ల పేర్లు వీరేసు, అప్పలస్వామి ఎనిమిదేసి గంటల కొకసారి డ్యూటీ మారుతుంది సర్వసాధారణంగా రంగన్న తాతకు 'నైట్ డ్యూటీ'యే పడుతుంది వీరేసు, అప్పలస్వామీ 'డ్యూటీ' పగలే పడేటట్లు చూసుకుంటారు ప్రయాణీకులు 'బక్షీసు' ఇవ్వకపోతే అడిగి మరీ వసూలు చేస్తారు. ధర్డుక్లాసు ప్రయాణీకులు 'బక్షీసు' ఇస్తే లోపల ఉండనిస్తారు ధనార్జన కోసం వాళ్ళు పడే తాపత్రయం చూస్తే రంగన్న తాతకు నవ్వు వస్తుంది మాట వరుసకి 'ఎంత్రటా డబ్బు కోసం ఆ కక్కూరితి ' అని రంగన్న తాత అంటే 'నీ కేంత్రటా రంగన్న తాతా ఒంటి వచ్చివి అలా ఏలా కుసురా డబ్బు కూడెట్టినా ఎవురు తినాల్రా? ' అంటారు 'ఆళ్ల మాటలు నిజెం డబ్బు తనేం సేసుకుంటాడు? కడుపుకి గడిసెందుకు ఒచ్చే జీతం సాలదూ? ' 'సెందిరి అన్నాయుం సేసి ఎళ్లిపోనాది' వాడి హృదయం ఆక్రోసించింది కళ్లల్లో నీళ్ళు ఉబికి చెంపల వెంట గెడ్డంలోకి జారినాయి.

మోహనరావు జేబులోంచి సిగరెట్టు కేసు, అగ్గిపెట్టె బయటకు తీశాడు కేసు తెరచి చూస్తే దాన్లో సిగరెట్లు లేవు! రంగన్న తాత వైపు చూస్తూ అన్నాడు.

"ఇదిగో చూడు..ఒకసారిలా వస్తావా?"

రంగన్న తాత ఆలోచనలకు అంతరాయం కలిగింది. కళ్లు తుడుచుకుని మోహన రావు దగ్గరకు వచ్చాడు. రెండు రూపాయల నోటు వాడి చేతికిస్తూ అన్నాడు

"ఒక 'గోల్డుఫ్లేకు' సిగరెట్టు ప్యాకెట్టు తెచ్చి పెడతావా?."

'తేనా' అందామను కుంటూనే యాంత్రి కంగా నోటు అందుకుని బయటకు వెళ్లాడు రంగన్న తాత

మోహనరావు అద్దం దగ్గరకు వచ్చి ప్రతిబింబాన్ని చూసుకుంటూ నిలబడ్డాడు. ముఖం మీద కాస్త చెమట పట్టి ఉంది వెనుక వరండాలో ఉన్న 'వాష్ బేసిన్' దగ్గరకు వెళ్లి మొహం కడుక్కుని వచ్చి సూటు కేసులోంచి 'టర్కీ' తువ్వాలు తీసి తుడుచు కున్నాడు. పౌడరు కాస్త ముఖానికి రాసు కున్నాడు. సెంటు కాలరుకు మరికాస్త, పులుముకున్నాడు జుత్తు నీటుగా దువ్వు కున్నాడు. సెంటు వాసన గుప్పుమంది తన ప్రతిబింబాన్ని అద్దంలో మరోమారు చూసుకున్నాడు 'మోహనరావ్ చూడ ముచ్చటైన విగ్రహం రానిది' అన్నది, అతడి మనసు అద్దాన్ని చూస్తూంటే సుమిత్ర చెక్కిళ్లు గుర్తుకి వచ్చినాయి. చేతో అద్దాన్ని తడిమాడు నున్నగా ఉంది. సుమిత్ర చెక్కిళ్లు ఇంతకన్నా నున్నగా ఉంటాయేమో? సుమిత్రతో పరి చయం ఆరునెలల ప్రాయానిది చాలా సార్లు చెక్కిళ్లు తాకాలని, ముద్దు పెట్టు కోవాలని ప్రయత్నించినా పడనిచ్చింది కాదు

# వర్ణచిత్రం

'పెళ్లయ్యేక నా సర్వస్వం నీదే మోహన్' అంటుంది సుమిత్ర. ఆరునెలల క్రితం సుమిత్ర దగ్గర నుండి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న తను..సుమిత్రకు కొద్ది అడుగుల దూరంలోకి వచ్చేశాడు!. తను కంగారు పడకూడదు. ఆడదాని మనసు లత లాంటిది సున్నితంగా, సుతారంగా అల్లుకుంటూ రావాలి శాఖలు వేసి అల్లు కుపోయి పువ్వులు పూస్తుంది అప్పుడు దాన్ని విడదియ్య గల శక్తి ఎవ్వరికీ ఉండదు. పర్సు తీసి దాన్లోంచి సుమిత్ర 'బస్టు సైజు' ఫోటో బయటకు తీశాడు. పరీ క్షగా చూస్తూ నిలబడిపోయాడు. పసిడి ఛాయ కోలముఖం. విశాలమైన కళ్లు. చిన్న నోరు. గులాబీ రేకుల్లా మృదువైన పెదాలు.. ఒత్తయిన తలకట్టు. సన్నని మెడ ఎత్తయిన రొమ్ములు మెడలో ఒంటి పేటగొలుసు .చెవులకు పాతకాలం దుద్దులు. సుమిత్ర మత్తును కలిగించే వస్తువు. చూస్తేనే చాలు మత్తు పుట్టుకొస్తుంది నరాలు బిగుసుకుంటాయి రక్తం వేడె క్కుతుంది మనసు, కళ్లెంలేని గుర్రంలా పరుగులు పెడుతుంది

మోహనరావు వాచీ వైపు చూసు కున్నాడు. ఇంకా రాలేదేమిటి సుమిత్ర?. వస్తూ ఉంటుంది . ఈపాటికి ఇంటి దగ్గర బయలుదేరే ఉంటుంది ఇంకా చాలా టైముంది. సుమారు అరగంటకుకాని మెయిలు రాదు. ఆతర్వాత పావుగంట పైన ఆగు తుంది. అంటే సుమిత్ర ముప్పావుగంట లోపుగా వస్తే చాలు. అన్ని సిద్ధంచేసి కూర్చున్నాడు తను. టిక్కెట్లు సిద్ధంగా ఉన్నాయి. తనమొహాన్ని మరోసారి అద్దంలో చూసుకున్నాడు. ఎంతో అందగాడుగా కన్పిం చాడు తనను చూడగానే సుమిత్రకు మత్తు పుట్టుకురావాలి! 'మోహన్' అంటూ వచ్చి మీద వాలిపోవాలి! అప్పుడు గాఢంగా— సుమిత్రా, తనూ ఏకమయి పోయేంత గాఢంగా కౌగలించుకోవాలి! గాఢంగా ముద్దు పెట్టుకోవాలి! అప్పుడు ప్రప్రథమంగా సుమిత్ర కౌగిలిలో ఉన్న సుఖం అనుభవం లోకి వస్తుంది సుమిత్ర పెదాలు వర్షించే అమృతధార రుచి తెలుస్తుంది

"బాబూ సిగరెట్లు"

మోహనరావు 'ఉలిక్కి'పడి ఫోటో పర్సులో పెట్టేసి సిగరెట్టు ప్యాకెట్టూ చిల్లరా అందుకున్నాడు రంగన్న తాత ఆ ఫోటో ఒక అమ్మాయిదని గుర్తించాడు. మోహనరావు సిగరెట్టు ముట్టించుకుని గుమ్మం దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు రంగన్న తాత ఆ ప్రక్కనే ఉన్న స్టూలుపై కూర్చు న్నాడు

"ఏంటి బాబూ ఎవరైనా రావాలా?"

"అవును అవును మా వాళ్లు రావాలి"


మోహనరావు తడబడ్డాడు

రంగన్నతాత మోహనరావు వైపు చూస్తూ 'మా వోళ్లు' అనుకున్నాడు. మావోళ్లంటే? వెంకన్న గుర్తుకు వచ్చాడు. 'ఏరేయి .ఎంకన్నా నిన్ను నేను సెమించినా దేవుడు సెమించడురా'

మోహనరావుకు రంగన్నతాత తన ప్రక్కన ఉండడం సుతరామూ ఇష్టంలేదు. అందువల్ల జేబులోంచి చిల్లర తీసి 'తల నొప్పిగా ఉంది కాఫీ తెచ్చి పెడతావా?' అన్నాడు రంగన్న తాత చిల్లర పుచ్చుకుని వెళ్లాడు

మోహనరావు కళ్లు సుమిత్ర కోసం ఆతృతతో వెదుకసాగినాయి ఎందుకు రాలేదో ఇంతవరకూ .నిశ్చయాన్ని . మార్చుకోలేదు కదా లేదు మార్చుకోదు తప్పకుండా వస్తుంది రైలు ఇంకా ఇరవై నిముషాలకు కానీ రాదు

సుమిత్ర లాంటి అమ్మాయిని లొంగ దీసుకోవడం చాలా కష్టమైన పని ధైర్యం, ఓర్పూ అవసరం కంగారు పడితే మొదటికే మోసం వస్తుంది అసలు మేలిమి బంగారం కద..తనను ఒక దారిన పెట్టడానికి నాలుగా



నెలలు పట్టింది సుమిత్ర తండ్రి రిటైరయిన హైస్కూలు టీచరు. ఒక్కగానొక్క కూతురు సుమిత్ర బి. ఏ ప్యాసయింది. గరల్సు హైస్కూల్లో టీచరు వయస్సు సుమారు ఇరవై రెండేళ్లు సుమిత్ర తన కళ్లల్లో పడ్డప్పటి నుండే వెంటాడ్డం మానలేదు వల విసరడం తనకు చేత కాదూ? స్కూలు వదిలే వేళకు గేటు దగ్గర కాపలా పొద్దున స్కూలుకు వెళ్లే వేళకు ఇంటి సందు కొసన కాపలా ప్రేమ లేఖలు వ్రాశాడు. అందాన్ని వర్ణించాడు. ప్రేమ ఫలించకపోతే తన జీవితానికి ఇంక మిగిలేది విషాదమేనని కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు మొదట్లో సుమిత్ర తన పట్ల ఎంత ముభావంగా ప్రవర్తించింది ఎంతైనా సుమిత్ర ఆడది కాదూ?. ఆమెది ఆడ మనస్సు కాదూ? మొదట్లో సుమిత్ర కఠినంగా ప్రవర్తించినా ఆమె మనస్సు ఎంత మెత్తనిదో తెలియడానికి రెండు నెలలు పట్టింది

రంగన్నతాత కాఫీ తెచ్చాడు. మోహన రావు గ్లాసు అందుకుని కాఫీ త్రాగుతూ నిలబడ్డాడు. అతడి చూపులు మాత్రం గేటు వైపునే ఉన్నాయి

గతాన్ని నెమరు వేసుకుంటూ స్టూలు మీద కూర్చున్నాడు రంగన్నతాత

సైకిలు రిచ్చాలాగి బతికేవోడు తను సెందిరిని కని తనదారి సూసుకుంది ఇంటేది ఇంటేది కళ్లు మూసిందని ఏడుస్తావుంటే అందరూ ఏటన్నారు? మరో బొట్టిని కట్టబెట్టుకోమని సెప్పలేదూ? తను పెడసెవి పెట్టాడు ఆళ్ల మాటలు సెందిరి తన సొరస్సం దాన్ని సూస్తా వుంటే ఇంటేది గుర్తుకొచ్చేది ఏంలోటు సేసాడు? ముద్దుసేసి పెంచనేదూ? అదే తన కళ్లు కప్పి తప్పు సేసింది గంద..

ఎంకన్న రిచ్చాలాగేవోడు ఆడి ఏసాలు తనకు తెలివూ? ఓ రోజు ఏంసేసాడు ఎదవ డబ్బున్నోళ్ల పిల్ల రిచ్చా ఎక్కితే తప్పు దారట్టించి సెయ్యట్టుకోనేదూ? ఆపిల్ల తెగిసిన ఏళ మంచిది కారేదో అటేంప్పు వచ్చింది దేహసుద్ధి సేసారు ఎదవకి బుద్దొచ్చిందా? కుక్కతోక ఒంకర తీద్దారంటే సాద్దెమా? తెగతాగి ఎదవ కేక లేస్తూ రెండో ఆట సినెమా ఒదిలేక గుడిసె కొచ్చేవోడు ఆడెలాంటోడో తెలిసినా, ఆడి ఊసు నాకెందుకో అనుకుంటే సివరకు తన గుండెల్లోనే మంటెట్టినాడు గంద

అయిదేళ్ల కితం టేషన్ మేట్టారు



MTP-1-P-1-65166 Tl

కిట్టమూర్తి గోరు. దర్మప్రబువు.వాడుగ్గా టనే తీసుకొచ్చేవోడు టేషన్‌కు. తీసుకెళ్లేవోడు ఇంటికి..కూతంత దూరానికి పావలా డబ్బు లిచ్చేవోరు

ఓ రోజు రాతిరి ఎనకనించొచ్చి రిచ్చాని గుది ంది లారీ. 'అసలు దేవుడున్నాడా?' అన్పిస్తది ఆ డెయివరు తాగి నిసాలో ఉంటే పోలీసోడు ఏటన్నాడు? ఆడ్ని ఎనకేసుకొచ్చాడు తనను తిట్టేడు. రాంగ్ సెయిడున్నాడు 'ఆరను కొడతా వుంటే ఇనిపించ లేదా ఎదవా? సెవుటోడివా?' అన్నాడు. అనడు మరీ డెయివ రిచ్చినట్టు తనూ డబ్బిత్తే తన ఏంపు మాట్లాడేవోడు సీ. ఎదవలోకం. గడ్డి తింటారు గందా మనుసులు కానికోసం. 'డెయివరు ధర్మవా' అని తన కాలు ఇరిగింది తను కుంటోడయినాడు రిచ్చా తొక్కలేడు కూలిపని సేసుకుని బతుకుదారంతే బరువు లెత్తలేడు ముట్టెత్తుకుని బతకాలా? సెందిరి మాటేంటి. దాన్ని ఓ అయ్య సేతుల్లో ఎట్టేంత వరకూ తనకు నిదరట్టదు తన కాలు ఇరిగిందని ఎంత గోలెట్టింది? డెయివర్ని ఎన్ని తిట్టింది? కిట్టమూర్తి గోరి దగ్గరి కెళ్లి మొరెట్టుకుంటే ఈ నౌకరీ ఏయించారు దర్మప్రబువులు ఎప్పుడైనా డబ్బు కోసం ఆస పడ్డాడా మహానుబావుడు ఆయనతో పనిచేసే వోళ్లు ఇళ్లు కట్టనేదూ? డబ్బే ప్రదానం ఆళ్లకు గడ్డి తిన మన్నా తింటారుగందా! సీ సీ

రంగన్నతాత నౌకరీలో చేరినరోజు కృష్ణమూర్తిగారు అన్నారు "ఒరేయి నీ పనల్లా ఈ గది కాపలా కాయడం గది తుడవడం, కుర్చీలూ బల్లలూ తుడవడం" ఆయనకు దృష్టి అద్దంవైపు మళ్లింది దాని దగ్గరకు వెళ్లి అద్దాన్ని వేలితో తుడిచి 'చూశావురా, అద్దం మీద ఎంత దుమ్ముందో మనస్సూ అద్దమూ ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండలిరా.' అన్నారు.

'సరయిన మాటన్నారు అయ్యగోరు' అనుకున్నాడు రంగన్నతాత

మోహనరావు లోపలకు వెళ్లి కుర్చీలో కూర్చున్నాడు. సుమిత్రకు తండ్రంటే తగని భయం. తగని అభిమానం తగని ప్రేమ .కూతురు ఒక్కపావు గంట ఆలస్యంగా ఇంటికి వెడితే కాలుగాలిన పిల్లిలా వరండాలో పచార్లు చేస్తాడు ఆ ముసలాయన. పార్కుకయితే వచ్చేదికాని ఒకటే కంగారు..'నాన్న ఎదురు చూస్తూంటారు మోహన్. వెళ్లనా?' మరునాడు అనేది 'నాన్నగారు అడిగేరు మోహన్ ఆలశ్యమయిందేమని. స్కూల్లో పని ఉందని చెప్పాను..' మరో రోజు గుడికి వెళ్లినట్లు. మరో రోజు స్నేహితురాలి ఇంటికి వెళ్లినట్లు... అబద్ధాలు చెప్పించేంతగా తను సుమిత్ర చేత ప్రేమించబడ్డాడు!

ఫస్టు బెల్లయ్యింది. మోహనరావుకు ఆందోళన ఆరంభమయ్యింది గుమ్మం దగ్గరకు వెళ్లి నిలబడ్డాడు పావుగంటలో రైలు వచ్చేస్తుంది ఇంతవరకూ సుమిత్ర రాలేదు. ఎందుచేత? అనుమానం పొడసూపింది అంతలోకే ధైర్యాన్ని తెచ్చుకున్నాడు సుమిత్ర నిన్న ఏమంది? 'మోహన్ నిన్ను ప్రేమిస్తున్నాను .నన్ను అన్యాయం చెయ్యవు కదూ? నీతో ఎక్కడకు రమ్మన్నా వస్తాను..' తన మాటను కాదన గల శక్తిని సుమిత్ర కోల్పోయింది భగవంతుడు కూడా సుమిత్ర మనస్సు మార్చలేడు 'సుమిత్రా మద్రాసు వెళదాం ఊరు చూద్దాం తిరుపతి వెళ్లి పెళ్లి చేసుకుందాం' అంటే అరమోడ్పు కన్నులతో తనవైపు చూస్తూ 'నేనెంత అదృష్టవంతురాలిని మోహన్' అన్నది.. తనంటే తెలిగ్గా వచ్చేశాడు కాని సుమిత్ర రావడమంటే మాటలా? ముసలి తండ్రి చూపుల నుంచి దాటుకుని రావాలి చుట్టుపక్కల వాళ్లు అనుమాన పడకుండా రావాలి ఆ ముసలాయన మరీనూ సుమిత్రను పడుకోనివ్వడు తను పడుకోడు వరండాలో మంచం వేసుకుని కూతురిని కాపలా కాస్తూ పడుకుంటాడు సుమిత్ర వచ్చే సమయానికి లేచి కూర్చున్నాడేమో? అంతలోకే తన ఆలోచనకు నవ్వుకున్నాడు నిన్న సాయంత్రం తన ప్రోగ్రాము గుర్తు చేసినప్పుడు 'నాన్నకు రాత్రుళ్లు సరీగా నిద్రపట్టదు నేను బయలుదేరే సమయానికి లేచి కూర్చుంటే ఎలా రావడం?' అన్నది సమిత్ర అప్పుడు రెండు 'స్లీపింగ్ టేబ్లెట్లు' కొనిచ్చి పాలల్లో కలిపేసి ఇమ్మని చెప్పాడు 'నాన్నా! నువ్వు మరీ నీరసంగా కన్పిస్తున్నావు కాసిని పాలుతాగు' అంటుంది గ్లాసులో పాలల్లో టేబ్లెట్లు పడేసి కలిపేసి ఇస్తుంది అవి త్రాగి ముసలాయన ఆవలిస్తాడు. కళ్లు మూతలు పడతాయి మత్తుగా నిద్ర పట్టేస్తుంది రేపు బారెడు పొద్దెక్కేక మెలకువ వస్తుంది సుమిత్ర కోసం వెదుకుతాడు. గుండెలు బాదుకుంటాడు. అప్పటికి తనూ సుమిత్రా మద్రాసులో హోటల్లో డబుల్ రూములో..

మోహనరావును చూస్తూంటే రంగన్న తాత కళ్లముందు వెంకన్న విగ్రహమే మెదులోంది.

'సెందిరి సుక్కలాగుంటది.' అనుకునే వోరు సుట్టు పక్కలోళ్లు 'నీ బొట్టి కోసం ఎవడోపూజె సేస్తున్నాడు మావా....' అనేది పక్క గుడిసె లచ్చిమి ఆళ్ల మాటలిని సంబరపడే వోడు తను. ఎంకన్న కళ్లు దాని మీద పడానికి కారణం దాని అందమే గంద. మత్తు మందిచ్చినాడా? మాయ సేసినాడా? .కూతంత ఆలిస్పెంగా ఎడితే 'ఏటయ్యా..ఇంత ఆలిస్పెం.' అనే సెందిరి తనతో సెప్పకుండా, సెయ్యకుండా ఎంత పని సేసింది? తన సొరస్వమూ అదే ననుకున్నాడే? ముద్దు సేసి పెంచాడే.

ఆ రోజు టేషనుకాడ నుండి ఇంటికెడితే సెందిరి అగుపడలేదు ఎంకన్న మాయమయ్యేడు ఎంత ముద్దు సేసాడు దానికి ఏకట్టమైనా కలుగుతుందని నలుగురూ సెప్పినా మారు మను వాడలేదే. కిట్టమూర్తి గోరితో సెబితే ఆయనేటన్నారు? 'ఆళ్లోత్తే ఇద్దరికీ ముడెట్టెయ్యరా' తన కడుపున సెడపుట్టిందనుకున్నాడు... తెగిసి పోయేకంటే సత్తేమేలనుకున్నాడు.. అయ్యగోరి మాటలిన్నాక కోపం సల్లారినాది. ఇంటిది గుర్తుకొచ్చింది సెందిరి, కోసం ఎదురు సూసేడు.

నాల్నెల్ల తరువాతొచ్చింది. అది సెందిరేనా? ముద్దబంతి పువ్వు నాగుండే సెందిరి ఎలాగయిపోనాది? సుక్కలాగుండే సెందిరి ఎలాగయిపోనాది? ఇయ్యాలో రేపో అన్నాట్టుంది దాన్ని సూస్తావుంటే ఏడుపొగింది కాదు కొట్టనేదు. తిట్టనేదు. 'ఆడేడే?' అంటే తెగేడిసింది గుండె బాదుకుంది 'ఏటోయినాడో తెలియదయ్యా' అంది.

ఓ రోజు కూడుతిని కక్కుకుంటే ఏటో ననుకున్నాడు లచ్చిమి సెప్పింది 'నెల తప్పినాది మావా?' తను సింగమయినాడు సింత బరికుచ్చుకుని తెగబాది టేషనుకు వచ్చిసినాడు కిట్టమూర్తిగోరు ఏటన్నారు? 'కన్నకూతురిని నువ్వే సెమించక పోతే లోకం సెమిస్తదిరా?' కోపం సల్లారి పోయింది ఆరి మాటలు ఇన్నాక సేతులెలా వచ్చినయి సెందిరిని కొట్టడానికి? తను ఆలోచిస్తా వుంటే అయ్యగోరన్నారు .'మనస్సు అద్దం నాంటిదిరా..ఇరిగితే అతుక్కోదురా..

తను చేసిన తప్పు తెలిసింది..ఉగాటేయిద్యోక పరుగు పరుగున గుడిసె కెడితే ఎక్కడ సెందిరి?..సెందిరి పైకప్పుకి ఏల్లాడతా ఉంది..సెందిరి నిదరోతున్నాది. సెందిరి మరి లెగదు..సెందిరి మరి తప్పు సెయ్యదు. సెందిరీ నన్ను సెమించు.. సెందిరీ నన్ను సెమించు .ఏటనుకుని లాబం 'ఈ పూట, కూడు సరిగా తిన్లేదయ్యా మరీ సిక్కు తున్నవయ్యా..కూతంత బేగిరం వలాస్తాం డయ్యా..ఏటయ్యా సుట్టముక్క కూతంత తగ్గించవు గంద..దగ్గుతున్నవ్.' అనే సెంది రేదీ?...అయ్య గోరేటన్నారు? .. 'మనసు అద్దం నాంటిదిరా' సెందిరి మనసు ఇరిగి పోయింది. తనే ఇరగకొట్టేడు. తన మనసే కుంటిదయినాదా? గుండెలదిరేలా ఏడిస్తే వస్తాదా? ఆ ఎంకన్నగాడి వల్లే గదా ఆడికేం మారాజులా పూలరంగడిలా ఉండుం టడు .దేవుడేడో? పాపిసీరాయువూ అన్నేదో పెద్దోళ్లు?.

అయ్యగోరూ ఎల్లిపోనారు ఒదినీ అయి ఎళ్లి పోయేరోజు తను సంటోడిలా ఏడి సాడు ఎడనున్నారో అయ్యగోరు?

సెకండు బెల్లయ్యింది మోహనరావు ముఖంలో రంగులు క్షణక్షణానికీ మారు తున్నాయి మనస్సు ఆశ, నిరాశల మధ్య ఊగిసలాడుతున్నది సుమిత్ర ఇంకా రాలేదు హృదయం సుమిత్ర వస్తుందని చెబు తున్నది. టిక్కెట్లు కొన్నాడు మద్రాసులో హోటల్లో 'డబుల్' రూము రిజర్వు చెయ్య మని టెలిగ్రాము ఇచ్చాడు సుమిత్రతో స్వర్గంలో విహరించాలని ఎన్నెన్ని కలలు కన్నాడు?..ఛీ .ఛీ ఆడదాన్ని నమ్మమని ఎవరు చెప్పారు? గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు

ఆకసంలో నల్లని మబ్బులు చేరి ఉం టటా అల్లుకున్నాయి లోకంలో పాపాన్ని చూసి 'భరించలేక' అన్నట్లు కన్నీటి చుక్కల్ని విడులుస్తున్నాయి . ప్లాటుఫారం పైన ఉన్న రేకులు దభదభమని శబ్దం చేస్తున్నాయి.

'వారషం ఒస్తున్నాది' గొణుక్కు న్నాడు రంగన్నతాత. మోహనరావుకు ఉన్న కొద్దిపాటి ఆశ సడలింది వెధవ వర్షం సరిగ్గా ఇప్పుడే రావాలా?. రైలు ఏ హడా వుడీ లేకుండా వచ్చి ఆగింది ఒక్కసారి ప్లాటుఫారం మీద రణగొణ ధ్వనులు మిన్ను ముట్టినాయి .చుట్టా బీడీ. సిగరెట్.. పాన్ పాన్ కాఫీ. టీ జీడిపప్ దిగేవాళ్లను దిగనివ్వకుండానే రైలు ఎక్కేస్తున్నారు జనం.. ఇవేమీ గమనించే స్థితిలో లేడు మోహనరావు .అతడి కళ్లు వెదుకుతున్న దల్లా సుమిత్ర కోసం. తరచి తరచి రైలు వైపు, గేటు వైపు వెర్రి చూపులు చూడ సాగాడు...

ఒక అమ్మాయి గేటులోంచి ప్లాటుఫారం మీదకు వచ్చింది. మోహనరావు హృద యం ఆనందంతో గెంతులు వేసింది మనస్సు ఆనంద తరంగాలలో తలమునక లవుతున్నది . 'సుమిత్రా డార్లింగ్' అను కున్నాడు పట్టరాని సంతోషంతో. చెయ్యి ఊపుతూ నిలబడ్డాడు సుమిత్ర అతడివైపు వడివడిగా అడుగులు వేస్తూ వస్తోంది..


సుమిత్ర దగ్గరకు వచ్చేసింది ఆయాస పడుతోంది రొమ్ము లెగిరెగిరి పడుతున్నాయి కళ్లల్లో గంభీరత కొట్టవచ్చినట్లు కన్పి స్తోంది రంగన్నతాత ఆమెను చూసి తెల్ల బోయాడు పోస్టాఫీసు కాడ పెంకు టింటో ఉండే పంతులమ్మ ఆబాబు దేవుడు అయితేనేం తనలాంటి అయ్య! .

"ఏమిటి సుమిత్రా.. అంత 'డల్'గా ఉన్నావ్? " సమిత్ర మాట్లాడలేదు

రంగన్నతాత ప్లాటుఫారం వైపు చూస్తూ నిలబడ్డాడు మోహనరావు వెయి టింగు రూములోకి నడిచాడు. సుమిత్ర అతడిని అనుసరించింది. ఆమెను గుడ్లప్ప గించి చూస్తూ నిలబడ్డాడు మోహనరావు బట్టలు తడిసి శరీరానికి అతుక్కుపోయాయి. అవయవ సౌష్టవం, శరీరపు వంపులు మరింత స్పష్టంగా కన్పిస్తున్నాయి. నీటి బిందువులు ముంగురులలోంచి చెక్కిళ్ల మీదకు జారి రొమ్ముల మీద పడు తున్నాయి. ముఖం మంచులో తడిసిన గులాబీ పువ్వులా ఉంది. ఆమెను చూస్తుంటే మోహనరావుకు రక్తం వేడెక్కుతున్నది. అణువణువూ సుమిత్ర పొందు కోసం తహ తహ లాడుతున్నది. కళ్లల్లో కోరికలు పడగలెత్తినాయి. .సుమిత్ర క్షణక్షణానికీ మరింత అందంగా కన్పిస్తున్నది. మోహన రావుకు అమాంతంగా ఆమెను కౌగలించు కుని ముద్దు పెట్టుకోవా లన్పించింది... అంతలోకే తెలివి తెచ్చుకుని, కోరికల్ని చంపు కున్నాడు తన కంగారు పడకూడదు.. కనీసం రైలు ఎక్కేంతవరకూ కంగారు పడకూడదు లేకపోతే మొదటికే మోసం రావచ్చు. తను కట్టుకున్న ఆశాసౌధాలు కుప్పగా కూలిపోవచ్చు కొద్దిక్షణాలు ఓపిక పట్టాలి తప్పదు. .

సుమిత్ర ఒక మధుపాత్ర. ఆ మధువును తృప్తి తీరేంతవరకూ నిషా దిగేంతవరకూ త్రాగుతూనే ఉండాలి

"అమ్మయ్య సుమిత్రా. నువ్వు వచ్చేశావు.



ఎంత సస్పెన్సులో పెట్టావు నన్ను మూడు గంట నుండి నువ్వు వస్తావో లేదోనని ఎంత ఆందోళన పడుతున్నాను..''

''నీతో మాట్లాడాలి మోహన్..''

''మాట్లాడుకోడానికి ఇకముందు నీకు కావాల్సినంత టైము ఉంటుంది.. రైలు ఎక్కేక నీ ఇష్టం నీ 'సూటుకేసు' ఏదీ?... ఆ చీరేమిటి? సర్లే.''

''సూటుకేసు తేలేదు మోహన్.. దాని అవసరంలేదు.'' మోహనరావు నవ్వాడు.

''అవునవును 'సూటుకేసె'ందుకు?.. మద్రాసు వెళ్ళాక నీకు కావాల్సినవి కొను క్కుందువుగాని నీ మోహన్ నువ్వేది కోరితే అదివ్వగలడు సుమిత్రా పద. పద. రైలు కదుల్తుంది ''

మోహనరావు సూటుకేసు అందు కున్నాడు.

'మనం వెళ్ళడంలేదు మోహన్.. నాన్న గారితో చెప్పేశాను మనం ప్రేమించుకున్నా మనీ. పెళ్లి చేసుకుందామన్న నిశ్చయానికి వచ్చామనీ ''

మోహనరావు సూటుకేసు నేల జారింది.. తడబడ్డాడు.

''ఎందుకు చెప్పావ్ ఎందుకు చెప్పావ్ సుమిత్రా...''

సుమిత్ర కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి... తలదించుకుని కొంగుతో తుడుచుకుంటూ అన్నది

''మోహన్. నాన్నగారి కళ్లు కప్పాలని ప్రయత్నించాను. ఆయన నన్ను ఎంతగా విశ్వసిస్తారో నీకు తెలియదు. కేవలం నా సుఖం కోసం తన సుఖాల్నీ, జీవితాన్ని త్యాగం చేశారు. ఇవాళ సాయంత్రం అన్నారు 'నేను ఎంతకాలమో బతక నన్పిస్తోంది నీ పెళ్లి చేసెయ్యాలని ఉంది నీ మనసులో ఎవరైనా ఉంటే చెప్పమ్మా' అని అప్పుడు ఆయన మంచితనం తెలిసింది. నా తొందర పాటుకు సిగ్గుపడ్డాను ''

''.......... .  .''

''మన ప్రేమను గురించి చెప్పినపుడు ఆయన కోపం తెచ్చుకోలేదు 'నీ సుఖమే నాక్కావాలి తల్లీ ఒకరికొకరు ఇష్ట మయితే నాకేం కావాలి అతడ్ని తీసుకురా. మాట్లాడతాను.' అన్నారు నాన్నగారి మాటకు తిరుగుండదు మోహన్. ఆయన మన పెళ్లికి ఒప్పుకున్నట్లే.'

మోహనరావు గతుక్కుమన్నాడు. అంత

# వర్ణచిత్రం

లోకే దిగజారిన ధైర్యాన్ని తెచ్చి పెట్టు కున్నాడు. సుమిత్ర రైలు ఏక్కేంతవరకూ మంచిగా నడుపుకు రావాలి..ఆ తర్వాత తన ఇష్టం. పెదాలు తడుపుకున్నాడు.

''సుమిత్రా మనం ప్రోగ్రాము వేసు కున్నాం...టిక్కెట్లు కొన్నాను.. మద్రాసులో హోటల్లో గది 'రిజర్వు' చెయ్యమని టెలి గ్రాము ఇచ్చాను. మద్రాసులో నాలుగు రోజులుండి ఊరు చూసి తిరుపతి వెడదాం.. పెళ్లి చేసుకుందాం.. మీ నాన్నగారు ఇష్ట పడ్డారంటున్నావు కద.. ఆ బెంగాలేదు మనకు ..''

''లేదు మోహన్ నన్ను విశ్వసించి పం పారు. నీతో వచ్చేస్తే ఆయన మనసు దెబ్బతింటుంది. ఆయన తట్టుకోలేరు. పద మోహన్.''

''సుమిత్రా నన్ను విశ్వసించలేవా?..''

సుమిత్ర తలెత్తి ఆతడి వైపు చూసింది. ఆమె కన్నీటి కళ్లల్లో హాసరేఖ మెదిలింది.

''నువ్వెంత అమాయకుడివి మోహన్ నిన్ను విశ్వసించకపోతే ఇంతగా ప్రేమించ గలనా? ఇలా ఒంటరిగా రాగలనా? నేన యితే విశ్వసిస్తాను నిన్ను. నాన్నగారెలా విశ్వసిస్తారు?. ''


''అంతేనా సుమిత్రా నువ్వురావా?..''

''పద మోహన్..పెళ్లయ్యేక వెడదాం. నువ్వెక్కడకు రమ్మంటే అక్కడికి వస్తాను'' సుమిత్ర ఆర్ద్రతాపూరితమైన స్వరంతో మోహనరావు కళ్లు ఎర్రబడినాయి కను బొమలు ముడివడినాయి.

''నువ్వు ఇంత నాటక మాడతావని తెలీదు నీ ప్రేమ అనురాగం అంతా నటన ''

''లేదు మోహన్..నిన్నెంతగా ప్రేమిస్తు న్నానో ఎలా చెప్పను?. ''

సుమిత్ర వైపు చూశాడు మోహనరావు సుమిత్ర ఒక గులాబీ పువ్వు ఆ పువ్వును ఆఘ్రాణించి నలిపి పారెయ్యాలి శరీరం అనుభవం కోసం తొందరపడుతున్నది.




కళ్లల్లో కోరికలు బుసలు కొడుతున్నాయి.. అతడి వైపు చూసి బిత్తరపోయింది సుమిత్ర..

'ప్రేమ..పెళ్లి..' కసిగా అంటూ ఆమె చేతులు గట్టిగా పట్టుకుని ముందుకి లాక్కో ప్రయత్నించాడు 'వదులు వదులు' అని వేడుకున్నది సుమిత్ర. అతను విన లేదు సుమిత్ర పెనుగులాడింది. గాజులు బద్దలయి ముక్కలు నేలమీద పడినాయి. అతడికి ఆమె కళ్లల్లో ఆవేదన అర్థంకాదు.. ఆమె మాటలు వినిపించవు.. అతడికి కన్పి స్తున్నదల్లా గులాబీపువ్వు. దాన్ని నలిపి నలిపి పారెయ్యాలన్న కోరిక..

''రక్షించు దేవుడా ''

పెనుగులాడి పెనుగులాడి శక్తిని కోల్పోయి లొంగిపోయే ముందు స్త్రీ చేసే ఆక్రందనమది.

రంగన్నతాత వెనుదిరిగి చూశాడు జరుగు తున్న అత్యాచారం అర్థమయ్యింది కుంటు కుంటూ వచ్చి తన బలమైన హస్తాల్తో మోహనరావు మెడ పట్టుకుని ముందుకు లాగేడు.

పులి పంజా నుండి తప్పించుకున్న లేడి పిల్లలా అదిరే గుండెలతో ఒక్కఅంగలో దూరంగా వెళ్లి నిలబడింది రెండు చేతు ల్తోటీ మొహాన్ని కప్పుకుని ఏడుస్తున్నది సుమిత్ర..

''నువ్వా? ..''

''ఆ పిల్ల మీద సెయ్యేసేవంటే జాగ రత్త....''

''కుంటి వెధవా.''

మోహనరావు బలాన్నంతనూ కూడ దీసు కుని రంగన్న తాతను ఒక్కనెట్టు నెట్టాడు. రంగన్నతాత తూలి క్రింద పడ్డాడు. కళ్ల జోడు దూరంగా గోడ దగ్గర పడింది. మోహనరావు సూటుకేసు పుచ్చుకుని వెళ్లి రైలెక్కాడు.

'ఏరేయి ఎంకన్నా నిన్ను నేను సెమిం చినా దేవుడు సెమించడురా.' రంగన్నతాత గొణుక్కున్నాడు

లైటు నిశ్చితంగా, నిశ్చలంగా వెలు గుతూనే వుంది. సుమిత్ర ఏడుస్తోంది హృదయ విదారకంగా. మబ్బులు కన్నీరు వర్షిస్తూనే ఉన్నాయి. రైలు కూత వేసింది

అద్దం బద్దలయ్యింది.. ●